@netifocusnews @focustv www.netifocusnews.com
TS-18-0006625
FOCUS TELUGU TV
అనునిత్యం - ప్రజాపక్షం
# నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
COMPLIMENTARY COPY
తెలుగు డిజిటల్ దినపత్రిక
ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక | గురువారం 29, ఫిబ్రవరి 2024 | పేజీలు: 04



## 4న రాష్ట్రానికి ప్రధాని మోదీ

- ఆదిలాబాద్‌లో శంకుస్థాపనలు, సభ..
- 5న సంగారెడ్డి సభకు ప్రధాని

వివరాలు 02లో..




# ఓఆర్ఆర్ టెండర్లపై విచారణ

## సీబీఐ లేదా అదే స్థాయి సంస్థతో దర్యాప్తునకు సీఎం ఆదేశం



నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఫిబ్రవరి28:

**ఓఆర్ఆర్ టోల్ టెండర్లలో** జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలని హెచ్ఎండీఏ అధికారులను సీఎం ఆదేశించారు. కనీస రేటు నిర్ణయించకుండా టెండర్లు ఎలా పిలిచారని ప్రశ్నించారు. టెండర్లలో ఏయే సంస్థలు పాల్గొన్నాయి? అవకతవకల్లో ఎవరెవరి ప్రమేయముంది? తదితర అన్ని కోణాల్లో దర్యాప్తు జరపాలని చెప్పారు. టెండర్లకు అనుసరించిన విధానాలు, ఫైళ్లు కదిలిన తీరు, జరిగిన అవకతవకలపై పూర్తి వివరాలను సమర్పించాలని హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్ ఆమ్రపాలిని ఆదేశిం చారు. ఈ వ్యవహారానికి సంబంధించిన ఫైళ్లు ఏవైనా మిస్సయినట్లు గుర్తిస్తే.. వెంటనే సంబంధిత అధికారులు, బాధ్యులైన ఉద్యోగులపై వ్యక్తిగతంగా కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. హెచ్ఎండీఏ నుంచి పూర్తి నివేదిక అందిన తర్వాత కేబినెట్లో చర్చించి, టెండర్ల వ్యవహారంపై సీబీఐ లేదా అదే స్థాయి దర్యాప్తు సంస్థతో విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

### టెండర్ విధానంతో రూ.15వేల కోట్లకు పైగా నష్టం!

టెండర్లకు ముందు ఓఆర్ఆర్‌పై టోల్ కింద ఏడాదికి రూ.600 కోట్ల ఆదాయం వచ్చేదని అధికారులు సీఎంకు వివరించారు. అలాంటప్పుడు 30 ఏళ్లకు రూ.18 వేల కోట్ల వరకు ప్రభుత్వానికి మిగతా 2లో..



## హెచ్ఎండీఏలో విజిలెన్స్ సోదాలు

- హైరైజ్ అనుమతులపై కీలక ఫైళ్లు స్వాధీనం
- ఫైళ్లను సీజ్ చేసిన విజిలెన్స్ అధికారులు

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఫిబ్రవరి28:

హెచ్ఎండీఏలో విజిలెన్స్ సోదాలు కలకలం రేపుతున్నాయి. హెచ్ఎండీఏ కార్యాలయంలో బుధవారం ఉదయం నుంచి విజిలెన్స్ సోదాలు కొనసాగాయి. 50 మంది స్పెషల్ టీమ్‌తో సోదాలు చేపట్టారు. గత మిగతా 2లో..



## రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది

- వరుసగా ఐదో ఏడాది రైతు భరోసా అందిస్తున్నాం
- వైఎస్సార్ రైతు భరోసా పెట్టుబడి సాయం జమ
- బటన్ నొక్కి విడుదల చేసిన సీఎం జగన్

2

# నేడు డీఎస్సీ నోటిఫికేషన్!

## 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జారీ

- గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు
- గ్రూప్-1 నోటిఫికేషన్ తరహాలో నిర్ణయం
- గతంలో దరఖాస్తు చేసిన అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు
- 5,089 పోస్టులకు గతంలో నోటిఫికేషన్
- అదనంగా 5973 పోస్టులతో తాజా ప్రకటన

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఫిబ్రవరి 28:

ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు శుభవార్త. రాష్ట్ర ప్రభుత్వం 11,062 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు గురువారం నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉంది. మిగతా 2లో..





## కవిత కేసు విచారణ 13కు వాయిదా

నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-ఫిబ్రవరి28:

మహిళలను దర్యాప్తు సంస్థలు ఇంట్లోనే విచారించాలనే అంశంపై భారాస ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీం కోర్టు మార్చి 13కు వాయిదా వేసింది. ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ జరగాల్సి ఉంది. అయితే, కోర్టు సమయం మిగతా 2లో..



## మూసీ కబ్జాని పట్టించుకోరా

- భూకబ్జాలు చేసి 111 జీవో ఎత్తేశారు: కిషన్ రెడ్డి

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఫిబ్రవరి28:

హైదరాబాద్‌లోని మూసి పరివాహక ప్రాంత భూములు కబ్జాలకు గురవుతున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆ భూములను పేదలకు అద్దెకు ఇవ్వడం మిగతా 2లో..

## ఎవరి పేరుమీద ఉన్నా సబ్సిడీ గ్యాస్!

- రేషన్‌కార్డులో తప్పనిసరిగా నమోదై ఉండాలి..
- రేషన్ కార్డే ప్రామాణికంగా 'మహాలక్ష్మి' పథకం
- సందేహాలకు పౌర సరఫరాలశాఖ స్పష్టత



నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్, ఫిబ్రవరి 28:

**మహాలక్ష్మి పథకంలో రూ.500కే** వంటగ్యాస్ సిలిండర్ పంపిణీ పథకం ఉన్న పలు సందేహాలకు పౌర సరఫరాలశాఖ స్పష్టతనిచ్చింది. మహిళల పేరు మీదే కాకుండా, కుటుంబ సభ్యుల్లో ఎవరిపేరుమీద గ్యాస్ కనెక్షన్ ఉన్నా కూడా వారిని లబ్ధిదారుల జాబితాలో చేర్చుతారు. అయితే గ్యాస్ కనెక్షన్ ఎవరి పేరు మీద ఉందో, సదరు వ్యక్తిపేరు రేషన్‌కార్డులో తప్పనిసరిగా మిగతా 2లో..

నిత్య నూతనంగా వెలువడుతూ..
నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక
సంచలన వార్తా కథనాలతో నిత్యం విశేష పాఠకాదరణ పొందుతున్న, నేటి ఫోకస్ న్యూస్ డిజిటల్ తెలుగు దిన పత్రికకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల వారిగా, నియోజకవర్గాల వారిగా, మండలాల వారిగా, మండలాల వారిగా బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్లు, విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు ఈ క్రింది నెంబర్‌కు సంప్రదించగలరు.
9848488596
FOCUS TELUGU TV

నేటి ఫోకస్ న్యూస్

గురువారం 29, ఫిబ్రవరి 2024

## 4న రాష్ట్రానికి ప్రధాని మోదీ..

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఫిబ్రవరి 28:**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన ఖరారైంది. మార్చి మొదటి వారంలో ఆయన రాష్ట్రానికి రానున్నారు. 4, 5 తేదీల్లో ఆదిలాబాద్, సంగారెడ్డి బహిరంగ సభల్లో పాల్గొననున్నారు. మార్చి 4న ఆయన నాగ్‌పూర్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా ఆదిలాబాద్‌కు వస్తారు. పదేళ్ల తర్వాత ప్రధాని మోదీ ఆదిలాబాద్ పర్యటనకు వస్తున్నారు. అక్కడ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారు. ఆ తర్వాత నాందేడ్ చేరుకొని, అక్కడి నుంచి తమిళనాడు వెళ్లి చైన్నైలో ఓ కార్యక్రమంలో పాల్గొంటారు. అదే రోజు రాత్రికి హైదరాబాద్ చేరుకొని, రాజ్‌భవన్‌లో బస చేస్తారు. మార్చి 5న ఉదయం 11 గంటలకు సంగారెడ్డి చేరుకుంటారు. అక్కడ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని, శంకుస్థానలు చేస్తారు. మధ్యాహ్నం బహిరంగ సభలో పాల్గొంటారు. తర్వాత బేగంపేట విమానాశ్రయం నుంచి ఒడిసా వెళ్తారు. కాగా, 5న ప్రధాని మోదీ సభకు అనువైన ప్రాంతాన్ని బీజేపీ నాయకులు పరిశీలిస్తున్నారు. ఈ సభను సంగారెడ్డి లేదా పటాన్‌చెరు శివారులో నిర్వహించే అవకాశాలున్నాయని తెలిపారు. బహిరంగ సభా స్థలిపై గురువారం రాష్ట్రస్థాయి నాయకత్వం సంగారెడ్డిలో సమావేశమై నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. పటాన్‌చెరు పట్టణ శివారులో ఔటర్ సర్వీస్ రోడ్డు పక్కన విశాల ప్రాంగణాన్ని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధులు రాణిరుద్రమదేవి, సంగప్ప, జిల్లా అధ్యక్షురాలు గోదావరి పరిశీలించారు.

## హెచ్‌ఎండీఏలో విజిలెన్స్ సోదాలు

(మొదటి పేజీ తరువాయి..)

ప్రభుత్వంలో అనుమతి ఇచ్చిన ఫైల్స్‌ను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మైత్రీవనం నాలుగో అంతస్తులో ఉన్న అన్ని ఫైల్స్‌ను విజిలెన్స్ సీజ్ చేసింది. అంతేకాకుండా.. స్వర్ణజయంతి కాంప్లెక్స్‌లోని ఏడో అంతస్తులో కూడా తనిఖీలు చేస్తున్నారు. అరెస్ట్ వారెంట్‌తో వెళ్లిన విజిలెన్స్ నిఘా టీం.. హెచ్‌ఎండీఏ ఇద్దరు డైరెక్టర్లు గతంలో అనుమతించిన ఫైల్స్‌పై ఆరా తీశారు. ఆన్‌లైన్ డేటా నుంచి చెరువులు మాయంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. నాలుగు రోజుల క్రితమే దాడులు జరుగుతాయని జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ అధికారులను ముందే హెచ్చరించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 3,500 చెరువుల డాటా ఆన్‌లైన్‌లో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే చెరువుల పరిరక్షణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో అవినీతి, అక్రమాలకు పాల్పడ్డ అధికారులపై చర్యలకు రంగం సిద్ధమైంది. అక్రమ లే-అవుట్, బిల్డింగ్ అనుమతులపై దర్యాప్తు చేస్తున్నారు. హెచ్‌ఎండీఏలో కొన్ని రోజుల క్రితం ఏసీబీ కూడా దాడులు నిర్వహించింది. ఫైళ్లను పరిశీలించే క్రమంలో హెచ్‌ఎండీఏలోని ఘట్‌కేసర్, శంషాబాద్, శంకర్‌పల్లి జోన్‌లకు చెందిన ప్లానింగ్ అధికారులు, ఏపీఓలను తమ వద్దకు రప్పించి పలు అనుమతులపై ప్రశ్నల వర్షం కురిపించారు. ముఖ్యంగా 2018 నుంచి 2023 వరకు పని చేసిన హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణ హయాంలో ఇచ్చిన హై రైజ్ భవనాల అనుమతులపై ఏసీబీ అధికారులు దృష్టి సారించారు. ఒకవైపు విజిలెన్స్ సోదాలు కొనసాగుతుండగానే.. మరోవైపు హెచ్‌ఎండీఏపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. అవినీతి వ్యవహారంపై సీఎం సీరియస్ అయ్యారు. పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. విజిలెన్స్ విచారణతో నిగ్గు తేల్చాలని నిర్ణయం తీసుకున్న సీఎం.. సమీక్షలో దాడులపై ఆరా తీశారు.

## మూసీ కబ్జాని పట్టించుకోరా

(మొదటి పేజీ తరువాయి..)

లేదా అమ్మడం జరుగుతుందని దీంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. అంబర్ పేట నియోజకవర్గంలో కిషన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రక్షాళన పేరుతో ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేసి డబ్బులు వృథా చేసిందని ఫైర్ అయ్యారు. వందల ఎకరాలను కబ్జా చేసి 111 జీఓ ను ఎత్తివేసిందని ఆరోపించారు. గత ప్రభుత్వం భూములను ఆక్రమించి అగాడాలకు పాల్పడిందని కిషన్ రెడ్డి ఆరోపించారు. ఇప్పుడు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మజ్లిస్ పార్టీ నాయకులతో కలిసి లండన్ వెళ్తుందని విమర్శించారు. అక్కడి నదిని చూపించి దానిలాగా ప్రక్షాళన చేస్తామని చెప్తున్నారని అసలు నగరంలో మూసీ పరివాహక ప్రాంతాలను ఆక్రమించిందే మజిలీస్ పార్టీ అని ఆరోపించారు. హైదరాబాద్ ను రక్షించాల్సిన అవసరం ఉందని కిషన్ రెడ్డి చెప్పారు. ఇందుకు ప్రజలంతా ముందుకు రావాలన్నారు.

## కవిత కేసు విచారణ 13కు వాయిదా

(మొదటి పేజీ తరువాయి..)

ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ జరగాల్సి ఉంది. అయితే, కోర్టు సమయం ముగియడంతో తదుపరి విచారణను త్వరగా జరపాలని కవిత తరఫు న్యాయ వాది కపిల్ సిబల్ కోర్టుకు విజ్ఞప్తి చేశారు. మార్చి 13న చూస్తామని ధర్మాసనం తెలి పింది. కాగా, మద్యం కేసులో విచారణకు రావాలని ఈడీ జారీ చేసిన నోటీసులను గతేడాది కవిత సవాలు చేశారు. గతంలో ఆమె పిటిషన్‌ను నళినీ చిదంబరం, అభిషేక్ బెనర్జీ కేసులతో జత చేసిన విషయం తెలిసిందే. పిటిషన్లపై విడివిడిగానే విచారణ చేపట్టనున్నట్లు గత విచారణలో జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్ ధర్మాసనం స్పష్టం చేసింది. 3 కేసులు వేర్వేరు అని, కలిపి విచారణ చేయడం సబబు కాదని ధర్మాసనం అభిప్రాయపడింది.

## వంగరలో బండి కాన్వాయ్‌పై దాడి

- కోడిగుడ్లతో దాడి చేసిన దుండగులు
- పివి స్వగ్రామంలోనే ఇంతదారుణం అని బండి విమర్శ
- పివికి భారతరత్న ఇచ్చి మోడీ గౌరవించారని వెల్లడి

**నేటి ఫోకస్ న్యూస్, హన్మకొండ-ఫిబ్రవరి28:**

భాజపా ఎంపీ బండి సంజయ్ కాన్వాయ్‌పై కోడిగుడ్ల దాడి జరిగింది. ఈ ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలో బుధవారం చోటుచేసుకుంది. ప్రజాహిత యాత్రలో భాగంగా సంజయ్ అక్కడ పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో వంగరలో దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఇంటిని సందర్శించారు. అనంతరం ముల్కనూర్ బయల్దేరుతుండగా ఇద్దరు వ్యక్తులు కోడిగుడ్లు విసరడంతో అవి కాన్వాయ్‌లోని మీడియా వాహనంపై పడ్డాయి. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ కార్యకర్తలే ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని భాజపా నేతలు ఆరోపించారు. పోలీసులకు ముందే సమాచారం ఇచ్చినా చర్యలు తీసుకోలేదన్నారు. బండి సంజయ్ మాట్లాడుతూ పోలీసుల సమక్షంలో కోడిగుడ్లతో దాడి జరిగినా వారు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాకు భద్రత అక్కర్లేదు. పోలీసులు నాతో రావొద్దు. నా రక్షణ మా కార్యకర్తలే చూసుకుంటారని మండిపడ్డారు. ఈ ఘటనతో హనుమకొండ జిల్లాలో ఉద్రిక్తత నెలకొంది. బండి సంజయ్ ప్రజాహిత యాత్ర కాన్వాయ్ పై గుర్తు తెలియని దుండగులు కోడిగుడ్లతో దాడితో పోలీసులు కూడా అలర్ట్ అయ్యారు. భీమదేవరపల్లి మండలం వంగరలో ఘటన జరిగింది. పీవీ నరసింహారావు స్వగ్రామంలో పీవీ విగ్రహానికి పూలమాలలు వేసి వెళ్తుండగా కాన్వాయ్ పై కోడిగుడ్లు పడటం స్థానికంగా ఉద్రిక్తతకు దారితీసింది. పీవీ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం బండి సంజయ్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల నుంచి ప్రధానిగా పనిచేసిన ఏకైక నాయకుడు పీవీ నర్సింహారావు అని బండి సంజయ్ అన్నారు. తెలంగాణ ఠీవిగా, పీవీ బహుభాషా కోవిదుడు, కవిగా, రచయితగా, జర్నలిస్టుగా పనిచేశారని తెలిపారు.

# ఓఆర్ఆర్ టెండర్లపై విచారణ

(మొదటి పేజీ తరువాయి..)

ఆదాయం వచ్చేదని కానీ కేవలం రూ.7,380 కోట్లకు ఐఆర్‌బీ కంపెనీకి ఎలా అప్పగించారని రేవంత్ ప్రశ్నించారు. హెచ్‌ఎండీఏ అనుసరించిన టెండర్ విధానంతో ప్రభుత్వం రూ.15 వేల కోట్లకు పైగా నష్టపోయిందని సమావేశంలో ప్రాథమికంగా అంచనా వేశారు. హెచ్‌ఎండీఏ రెండు కంపెనీలతో డీపీఆర్ తయారు చేయించగా, ప్రభుత్వ ఆదాయానికి నష్టం తెచ్చే డీపీఆర్‌ను ఎంచుకున్నారనే అభిప్రాయం వ్యక్తమైంది. దీంతో ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేయిస్తేనే నిజాలు బయటకు వస్తాయని సీఎం పేర్కొన్నారు. టెండర్ దక్కించుకున్న కంపెనీ ప్రభుత్వంతో చేసుకున్న కాంట్రాక్టు అగ్రిమెంట్‌ను చూపించి 49 శాతం వాటాను విదేశీ కంపెనీలకు అప్పగించిందని, విదేశీ కంపెనీలతో ఆ సంస్థ చేసుకున్న లావాదేవీలపై కూడా దర్యాప్తు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. హెచ్‌ఎండీఏ పరిధిలోని చెరువులు, కుంటలను పరిరక్షించాలని, అలాగే ల్యాండ్ పూలింగ్‌ను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. హెచ్‌ఎండీఏ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని, డిజిటల్, జీపీఎస్ విధానాలతో ఎక్కడ ఎంత స్థలముందో మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. ల్యాండ్ పార్శిల్స్, చెరువులు, కుంటలు ఆక్రమణకు గురి కాకుండా ప్రత్యేక అధికారులను నియమించాలని చెప్పారు. డీఐజీ స్థాయిలో ఒక ఐపీఎస్ అధికారిని నియమించాలని, ఇద్దరు ఎస్పీ ర్యాంకు అధికారులకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. కాగా హెచ్‌ఎండీఏ పరిధిలో దాదాపు 8,374 ఎకరాల ల్యాండ్ పార్శిళ్లు ఉంటే.. అందులో 2,031 ఎకరాల పార్శిళ్లు వివిధ స్థాయిల్లో కోర్టు కేసుల్లో ఉన్నాయని అధికారులు తెలిపారు. హైదరాబాద్‌తో పాటు వరంగల్, కరీంనగర్ తదితర పట్టణాల లే అవుట్లలో కమ్యూనిటీ అవసరాలకు ఇచ్చిన స్థలాలు తమ ఆధీనంలోనే ఉన్నాయా? లేక ఆక్రమణకు గురయ్యాయా? వెంటనే సర్వే చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ స్థలాల్లో ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పాఠశాలల ఏర్పాటుకు ముందుకొచ్చే కార్పొరేట్ కంపెనీలు, పేరొందిన పాఠశాలల యాజమాన్యాలకు వీటిని అప్పగించాలని సూచించారు. స్థానికులైన పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులకు ఉచితంగా కనీసం 25 శాతం అడ్మిషన్లు ఇవ్వాలని చెప్పారు. ప్రపంచ స్థాయి టూరిస్ట్ ప్లేస్‌గా హుస్సేన్‌సాగర్ పరిసరాలు హుస్సేన్ సాగర్ పరిసర ప్రాంతాలను ఆహ్లాదకరమైన, అందమైన జోన్‌గా తీర్చిదిద్దాలని సీఎం అధికారులకు ఆదేశించారు. ఇటు అంబేద్కర్ విగ్రహం, ఎన్టీఆర్ పార్కు, తెలంగాణ అమరుల జ్యోతి నుంచి అటు నెక్లెస్ రోడ్డు, ఇందిరా పార్కు, సంజీవయ్య పార్కు వరకు ఉన్న మొత్తం ప్రాంతాన్ని ప్రపంచ స్థాయి సందర్శనీయ ప్రాంగణంగా తయారు చేయాలని సూచించారు. హుస్సేన్‌సాగర్ చుట్టూ ఉన్న ఆక్రమణలను తొలిగించాలన్నారు.

దుబాయ్ తరహాలో స్కై వాక్ వే, ఫుడ్ స్టాళ్లు, చిల్డ్రన్ అమ్యూజ్మెంట్ జోన్, గ్రీనరీ, ల్యాండ్ స్కేప్‌లను అభివృద్ధి చేయాలని సూచించారు. అవసరమైతే ఈ ప్రాంతంలో వాహనాల రాకపోకలను మరో రూట్‌కు మళ్లించి పర్యాటక జోన్‌గా మార్చాలని చెప్పారు. వెంటనే అంతర్జాతీయ స్థాయి కన్సెల్టెన్సీలతో ఈ ప్రాజెక్టు నమూనాలు తయారు చేయాలని ఆదేశించారు. సీఎస్ శాంతికుమారి, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, ఆర్ అండ్ బీ ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్ ఆమ్రపాలి తదితరులు సమీక్షలో పాల్గొన్నారు.

# నేడు డీఎస్సీ నోటిఫికేషన్!

(మొదటి పేజీ తరువాయి..)

ఇందుకోసం గత ప్రభుత్వం 5,089 పోస్టులతో జారీ చేసిన నోటిఫికేషన్‌ను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ అధికారులు బుధవారం ప్రకటన విడుదల చేశారు. గత నోటిఫికేషన్ ఇచ్చినప్పుడు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం గత ప్రభుత్వం 5,089 పోస్టులతో 2023 సెప్టెంబరు 6వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో సుమారు 1.77 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించింది. ఈ మేరకు కొత్తగా మరో 5,973 ఖాళీ పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపింది. వీటితో కలిపి మొత్తం పోస్టుల సంఖ్య 11,062కు చేరింది. కాగా, కొత్త పోస్టులతో అనుబంధ నోటిఫికేషన్ జారీ చేస్తారన్న ప్రచారం జరిగినా.. మొత్తం పోస్టులకు కలిపి మళ్లీ నోటిఫికేషన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా పాత నోటిఫికేషన్‌ను రద్దు చేసింది. ఇటీవల గ్రూపు-1 పోస్టుల భర్తీలోనూ గత నోటిఫికేషన్‌ను రద్దు చేసి, కొత్త నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం టీచర్ పోస్టుల విషయంలోనూ ప్రభుత్వం అదే విధానాన్ని అనుసరించింది. అయితే గతంలో దరఖాస్తు చేసిన అభ్యర్థులెవరూ మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేకుండా నిర్ణయం తీసుకుంది. కొత్త అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది.

## పశుసంవర్ధకశాఖలో భారీ కుంభకోణం

**- ఎసిబి అధికారుల దర్యాప్తు**

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఫిబ్రవరి28:**

పశుసంవర్ధక శాఖలో భారీ కుంభకోణం జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఈమేరకు ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసేందుకు సిద్ధమయ్యారు. ఆవుల కొనుగోలు నిమిత్తం ప్రభుత్వ నిధుల నుండి రూ. 8.5 కోట్లను గత ప్రభుత్వం విడుదల చేసింది. అయితే.. ఆవులు అమ్మిన వ్యాపారులకు మాత్రం 4 కోట్ల రూపాయలు మాత్రమే అకౌంట్లో జమయ్యాయని అధికారులు గుర్తించారు. మిగిలిన 4.5 కోట్లు బినామీ అకౌంట్స్ కి ముఠా సభ్యులు మళ్ళించారని సమాచారం. కాగా దీనిపై రైతులు నిలదీయడంతో కోటిన్నర రూపాయలను ముఠా సభ్యులు తిరిగి ఇచ్చినట్లు తెలియవచ్చింది. తమకు ఇంకా మూడు కోట్ల రూపాయలు పశుసంవర్ధక శాఖ నుండి రావాలంటూ ఏసీబీకి పుంగనూరు ఆవుల రైతులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

# రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది

(మొదటి పేజీ తరువాయి..)

జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. మొత్తం 53.58 లక్షల మంది రైతన్నల ఖాతాల్లో రూ.1,078.36 కోట్లు జమ చేస్తున్నామని అన్నారు. కౌలు రైతులు, అటవీ, దేవాదాయ భూముల సాగు రైతులకు సాయం. 57 నెల్లలో రైతు భరోసా కింద అందించిన మొత్తం రూ.34,288 కోట్లు. మేనిఫెస్టోలో చెప్పిన దానికన్నా ఒక్కో రైతన్నకు అదనంగా రూ.17,500 ఇస్తున్నామని అన్నారు. మన ప్రభుత్వం వేసిన ప్రతీ అడుగూ కూడా రైతులు, రైతు కూలీలు బాగుండాలని వేశాం. క్రమం తప్పకుండా వైయస్సార్ రైతు భరోసా కింద సహాయాన్ని అందించాం. పెట్టుబడి సహాయంగా, రైతన్నకు దన్నుగా ఇది అందించాం. రాష్ట్రంలో దాదాపు 50శాతం లోపు రైతులన్నకున్న భూమి అర హెక్టారు లోపలే. హెక్టారు లోపల ఉన్న రైతులు 70 శాతం ఉన్నారు. ఈ పెట్టుబడి సహాయం వారికి ఎంతో మేలు చేసింది. వంద శాతం రైతులకు 80శాతం ఖర్చు రైతు భరోసా కింద కవర్ అయ్యింది. పేద రైతుల పక్షపాత ప్రభుత్వం మనది, దీనికి నేను గర్వపడుతున్నాను. సున్నా వడ్డీ కింద కూడా రూ.215.98 కోట్లు విడుదల చేస్తున్నాం. రుణాలు తీసుకుని క్రమం తప్పకుండా కట్టే రైతులకు మేలు చేస్తున్నాం.ఇప్పటివరకూ 84.66 లక్షల మంది రైతన్నలకు ఇప్పటి వరకూ అందించిన వడ్డీ రాయితీ 2,050 కోట్లు. మొత్తంగా రైతు భరోసా, సున్నా వడ్డీ కింద రైతులకు ఇవాళ విడుదలచేస్తున్న మొత్తం రూ.1,294.38 కోట్లు అందించాం. ప్రతీ అడుగులోనూ రైతన్నలకు తోడుగా నిలుస్తున్నాం. ప్రతీ పథకం దాదాపుగా పేద రైతు కుటుంబానికి అందుబాటులో ఉంచడం జరిగింది. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన దానికంటే ఏడాదికి రూ.12500 బదులు వేయి పెంచి రూ.13500 ఇచ్చాం. 50వేల స్థానంలో ఐదేళ్లలో రూ.67,500 ఇచ్చాం. చెప్పినదానికంటే ఎక్కువగా ఇచ్చిన ప్రభుత్వం మనది. రైతు కష్టం తెలిసిన ప్రభుత్వంగా ఈ ఐదేళ్లలో ముందుకు సాగాము. ప్రతీ సందర్భంలోనూ వారికి తోడుగా నిలిచామని అన్నారు. 9 లక్షల మంది రైతులకు 9 గంటలపాటు నాణ్యమైన కరెంటు ఇస్తున్నాం. ఉచిత విద్యుత్ కింద ప్రతి రైతుకు రూ.45వేల మేర మేలు జరుగుతుంది. ఏడాదికి దాదాపుగా రూ.9 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. రైతుల తరఫున ఉచిత పంటల బీమాకు ప్రీమియం కడుతున్న ఏకైక రాష్ట్రం మన రాష్ట్రం మనది. గతంలో ఎప్పుడూ కూడా రైతుల తరఫున ఎప్పుడూ బీమా ప్రీమియం చెల్లించలేదు. దేశంలో కూడా ఎక్కడా లేదు. రైతులకు ఎక్కడ కష్టం వచ్చినా ఏ సీజన్‌లో నష్టం జరిగితే అదే సీజన్ ముగిసేలోగా ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చాం. కేవలం ఈ ఐదేళ్లలో మాత్రమే ఇలా జరిగింది. ఇదొక విప్లవాత్మక మార్పు. నష్టం నుంచి రైతు తట్టుకుని నిలబడి తిరిగి పంటలు వేసుకునే పరిస్థితి రావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం విప్లవాత్మక చర్యగా దీన్ని అమలు చేసింది. గ్రామస్థాయి లో రైతు భరోసా కేంద్రాలను పెట్టాం. అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను రైతుకోసం పెట్టాం. రైతులకు ఇ-క్రాప్ చేస్తూ అన్నిరకాలుగా ఆదుకుంటున్నాం. విత్తనం నుంచి పంట అమ్మకం వరకూ కూడా రైతులను చేయిపట్టుకుని నడిపించాం. ఈ ఐదేళ్లకాలంలో మాత్రమే ఇలా జరిగింది. ఆక్వా రైతులకు రూ.1.5కే కరెంటు ఇస్తూ ఆదుకున్నాం. ఆక్వాజోన్లలో ఉన్న ఆక్వారైతులకు తోడుగా నిలిచాం. పాల సేకరణలో కూడా రైతులకు తోడుగా నిలిచాం. రూ.10-20ల వరకూ రైతులకు అధిక ధరలు వచ్చాయి. పాలసేకరణలో ఈ ఐదేళ్ల కాలంలోనే రైతులకు రేట్లు పెరిగాయి. సహకార రంగంలోనే దేశంలోనే అతిపెద్ద సంస్థ అయిన అమూల్‌ను తీసుకు వచ్చి ఈ రంగంలో పోటీని పెంచాం. తద్వారా రైతులకు మేలు జరిగింది. 100 సంవత్సరాల క్రితం భూ సర్వే జరిగింది. అప్పటినుంచి రికార్డులు అప్‌డేట్ కాకపోవడం, సబ్ డివిజన్లు జరక్కపోవడం జరిగింది. వివాదాలకు చెక్‌పడుతూ సమగ్ర సర్వే చేపట్టాం. రికార్డులను అప్‌డేట్ చేస్తూ రిజిస్ట్రేషన్ సేవలను గ్రామస్థాయిలో తీసుకు వచ్చాం. 34.77 లక్షల ఎకరాల మీద పూర్తి హక్కులను రైతులకు, పేదలకు కల్పించాం. గతానికి, ఈ ఐదేళ్ల కాలానికి తేడా గమనించాలని కోరుతున్నాను. 87,612 కోట్ల రూపాయలు రైతుల రుణాలు మాఫీచేస్తామని చంద్రబాబు చెప్పారు. బ్యాంకుల్లో బంగారం రావాలంటే బాబే ముఖ్యమంత్రి కావాలన్నారు. దీంతో రైతులు నమ్మి అధికారం ఇస్తే.. దారుణంగా మోసం చేశారు. బేషరతుగా రుణాలు మాఫీచేస్తానని చెప్పి చివరకు రుణమాఫీ పత్రాలు ఇచ్చి మోసం చేశారు. చివరకు సున్నా వడ్డీ పథకాన్ని కూడా ఎగొట్టారు. చివరకు మన ప్రభుత్వమే చెల్లించింది. బాబు హయాంలో రైతన్నలు కట్టిన వడ్డీలు, చక్రవడ్డీలే ఏడాదికి దాదాపు రూ.5-6 వేల కోట్లు. అంత దారుణంగా చంద్రబాబు గతంలో మోసం చేశారు. మనం ఈ ఐదేళ్లలో వైయస్సార్ రైతు భరోసా కింద రూ.34వేల కోట్లు ఇచ్చాం. ధాన్యం కొనుగోలుకోసం రూ.65 కోట్లు ఖర్చు చేశాం. ఇదికాక రూ.1.2 లక్షల కోట్లు రైతున్నలకు వివిధ పథకాలు ద్వారా అందించాం అని సిఎం అన్నారు.

# ఎవరి పేరుమీద ఉన్నా సబ్సిడీ గ్యాస్!

(మొదటి పేజీ తరువాయి..)

నమోదై ఉండాలని పేర్కొంది. రేషన్ కార్డునే ప్రామాణికంగా తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం 'మహాలక్ష్మి' పథకాన్ని అమలుచేస్తున్న నేపథ్యంలో ఆ కార్డులో పేరున్న ఏవ్యక్తి పేరుమీద గ్యాస్ కనెక్షన్ ఉన్నా... వారికి వంటగ్యాస్ సబ్సిడీ పథకం వర్తింపజేయాలని నిర్ణయించింది. పథకానికి అర్హతలు ఉండికూడా లబ్ధిదారుల జాబితాలో పేరు లేనివారికోసం మరో అవకాశం కల్పించేందుకు సీఎం రేవంత్ నిర్ణయించారు. ఆయన ఆదేశాలమేరకు పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు నేడో, రేపో మార్గదర్శకాలు జారీకానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 90 లక్షల రేషన్ కార్డులుంటే, అందులో 64 లక్షల మందికే గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీరిలో 58 లక్షల మంది ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న 58 లక్షల మందిలో సుమారు 40 లక్షల మందిని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే లబ్ధిదారులుగా ఎంపిక చేసింది. ఎంపికైనవారిలో మహిళలతోపాటు గ్యాస్ కనెక్షన్ ఉన్న పురుషులు కూడా ఉన్నట్లు పౌరసరఫరాలశాఖ స్పష్టంచేసింది. లబ్ధిదారుల ఎంపిక రేషన్‌కార్డు, ప్రజాపాలన దరఖాస్తు, యాక్టివ్ గ్యాస్ కనెక్షన్ ప్రాతిపదికగానే జరిగింది. ఇదిలాఉండగా గ్యాస్ కనెక్షన్ ఉండి, ప్రజాపాలనలో దరఖాస్తుచేసుకున్నవారు కొందరిని లబ్ధిదారులుగా ఎంపిక చేయలేదు. తిరస్కరణకు గురైన కారణాలపై పౌరసరఫరాలశాఖ అధ్యయనం చేసింది. రేషన్‌కార్డులు లేనివారు, చనిపోయిన వారిపేరుతో ఉన్న గ్యాస్ కనెక్షన్ వాడుతున్నవారు, ఇతరుల దగ్గర గ్యాస్ కనెక్షన్ కొని వినియోగిస్తున్నవారు, ఎల్‌పీజీ కనెక్షన్ ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నవాళ్లు ఉన్నట్లు గుర్తించారు. ప్రజాపాలన దరఖాస్తులో రాసిన కస్టమర్ ఐడీ, వినియోగదారుల ఐడీతో గ్యాస్ కంపెనీల వద్ద ఉన్న వివరాలు ట్యాలీ కాకపోవటం, నెంబర్ మ్యాచింగ్ జరగకపోవటంతో తిరస్కరణకు గురైనట్లు గుర్తించారు. ఇలాంటివారికి మరో అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసి ఉన్నందున... గ్యాస్ కనెక్షన్ వివరాలు, ఆధార్, రేషన్‌కార్డులు మరోసారి మండల రెవెన్యూ/పరిషత్ కార్యాలయంలో తీసుకునే ఏర్పాట్లు చేస్తోంది. ఈ ప్రక్రియ నిర్వహించటానికి కూడా కొన్ని మార్గదర్శకాలు రూపొందించాలని ప్రభుత్వం ఆదేశించటంతో... పౌరసరఫరాల భవన్‌లో అందుకు సంబంధించిన కసరత్తు జరుగుతోంది. నేడో, రేపో మార్గదర్శకాలు కూడా జారీచేసే అవకాశాలున్నాయి. అనంతరం మండల కార్యాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ప్రారంభం అవుతుంది.

# ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- ఆదిలాబాద్‌లో ప్రమాదానికి గురైన విద్యార్థి
- నిముషం ఆలస్యంతో కొందరికి నిరాకరణ

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఫిబ్రవరి28:**

తెలంగాణలో ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రశాంతంగా పరీక్షలు ప్రారంభం అయ్యాయి. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగలేదు. అయితే ఆదిలాబాద్ జిల్లాలో బైక్‌పై వస్తున్న విద్యార్థి బస్సును ఢీకొని గాయపడ్డాడు. అతడిని ఆస్పత్రికి తరలించడంతో పరీక్ష రాయలేకపోయాడు. బుధవారం నుంచి మొదలైన పరీక్షలు మార్చి 19 వరకు జరగనున్నాయి. ఉదయమే పరీక్షా కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు నిర్ణీత సమయానికి పరీక్షలకు హాజరయ్యారు. వీరి కోసం ప్రత్యేక బస్సులు కూడా ఏర్పాటు చేశారు. నిమిషం ఆలస్యం అయినా ఎగ్జామ్ హాల్‌లోకి అధికారులు అనుమతించ లేదు. నిమిషం నిబంధన కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా చాలా మంది విద్యార్థులు ఎగ్జామ్ సెంటర్ నుంచి వెనుదిరిగి వెళ్లిపోయారు. కుత్బుల్లాపూర్ గాంధీ నగర్ లోని కేమ్ బ్రిడ్జ్ కళాశాల లో ఇద్దరు విద్యార్థులు నాలుగు నిమిషాలు ఆలస్యంగా రావడంతో, కళాశాల యాజమాన్యం పరీక్షా కేంద్రాల లోపలికి అనుమతించలేదు. సిద్దిపేట జిల్లా సిద్దిపేట ప్రభుత్వ బాలుర కళాశాలకు ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలకు ఇద్దరు విద్యార్థులు ఆలస్యంగా రావడంతో అధికారులు అనుమతించకపోవడంతో వెనుదిరి వెళ్లారు విద్యార్థులు. బైంసా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు ఆలస్యంగా రావడంతో ఎగ్జామ్‌కు అధికారులు అనుమతించకపోవడంతో వెళ్లిపోయారు విద్యార్థులు. మొదటి, రెండో సంవత్సరాలకు కలిపి 9,80,978 మంది పరీక్ష రాయనున్నారు. మొదటి సంవత్సరంలో 4,78,718, రెండో సంవత్సరంలో 5,02,260 మంది హాజరు కానున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,521 కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. పరీక్షలను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించ బోమని అధికారులు స్పష్టం చేశారు. ఎవరైనా కాపీ కొట్టినా.. ఒక వ్యక్తికి బదులు మరో వ్యక్తి పరీక్ష రాసినా క్రిమినల్ కేసు నమోదు చేయనున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉండనుంది. విద్యార్థులు ఆయా కేంద్రాలకు చేరుకునేందుకు వీలుగా టీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఇదిలావుంటే ఇంటర్ పరీక్షలకు వెళుతున్న విద్యార్థి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరడిగొండ మండలం వదూర్ గ్రామానికి చెందిన విష్ణువర్ధన్ (17) ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. పరీక్ష రాసేందుకు బుధవారం ఉదయం బైక్‌పై ఇచ్చోడకు బయల్దేరాడు.

# నలిగిన బతుకులు!

- సూర్యాపేట జిల్లాలో ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- ఐదుగురి దుర్మరణం
- సిద్దిపేట జిల్లాలో బైక్, కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురి మృతి

**నేటి ఫోకస్ న్యూస్, మోతె, సిద్దిపేట-ఫిబ్రవరి 28:**

రోజూ కూలీ పనులకు వెళితే తప్ప బుక్కెడు బువ్వ దొరకని బడుగుజీవులు వారంతా! మిర్చి ఏరేందుకు పన్నెండు మంది కూలీలు పొద్దు పొద్దునే ఆటోలో బయలుదేరారు. ఒకట్రెండు నిమిషాల్లో మిర్చి చేనుకు చేరుకుంటారనగా ఘోరం జరిగింది. అండర్‌పాసను దాటుతుండగా ఆటోను ఓ ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు కూలీలు మృత్యువాతపడ్డారు. మరొకరు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. సూర్యాపేట జిల్లా మోతె మండల కేంద్రంలో ఈ రోడ్డు ప్రమాదం సంభవించింది. మృతుల్లో భార్యాభర్తలుండటం మరీ విషాదం. జిల్లాలోని మునగాల మండలం విజయరాఘవాపురం, రేపాలకు చెందిన మహిళా కూలీలు రోజూ వివిధ గ్రామాలకు మిర్చి ఏరేందుకు వెళుతుంటారు. బుధవారం ఆటోలో 11 మంది మహిళలు సహా 12మంది కూలీలు హుస్నేనాబాదకు బయలుదేరారు. ఉదయం 8 గంటలకు మోతెలోని అండర్‌పాస్ వద్దకు ఆటో చేరుకుంది. అదే సమయంలో ఖమ్మం నుంచి హైదరాబాద్ వెళ్తున్న మధిర డిపోకు చెందిన బస్సు అండర్‌పాస్ వద్ద ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో



మూడు పల్టీలు కొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో కందుల నాగమ్మ (60), చెరుకు నారాయణమ్మ(60), పోకల అనుసూయమ్మ (65) ఘటనాస్థలిలోనే మృతిచెందారు. క్షతగాత్రులను సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ రెమిడాల సౌభాగ్యమ్మ (58), కందుల గురువయ్య(63) మృతి చెందారు. మృతుల్లో కందుల గురువయ్య, నాగమ్మ భార్యాభర్తలు. చికిత్స పొందుతున్న వారిలో మరో మహిళా కూలీ పరిస్థితి విషమంగా ఉంది. ఆటోడ్రైవర్ పవన్ సహా ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు. బస్సు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**మరో ఘటనలో ముగ్గురి మృతి..**

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం రాంపూర్ శివారులో బుధవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బైకును కారు ఢీ కొట్టి రోడ్డు కిందికి దూసుకెళ్లింది. ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు, కారులో ప్రయాణిస్తున్న వారిలో ఓ యువతి మృతిచెందారు. కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన జక్కుల అనిల్ కుటుంబ సభ్యులు, బంధువులు హుస్నాబాద్‌లో పెళ్లికి హాజరై కారులో తిరిగి వస్తున్నారు. ఈ వాహనం పాలమాకుల నుంచి బద్దిపడగ వైపు వెళ్తున్న బైకును ఢీ కొట్టి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో బైక్ పై ఉన్న నంగునూరు మండలం బద్దిపడగకు చెందిన కట్ట రవి (55), నాగరాజు పల్లికి చెందిన ముక్కెర ఐలయ్య (60) అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ప్రయాణిస్తున్న వారిలో జక్కుల మమత (28) మృతిచెందింది. కారులోని మిగతాఏడుగురికి గాయాలయ్యాయి. వారిని సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

# హాట్ సీటుగా ఖమ్మం..

- అందిరి కన్నూ ఈ సీటుపైనే
- వీహెచ్, కుసుమ కుమార్‌ల దృష్టి
- ముగ్గురు మంత్రుల కుటుంబసభ్యుల కర్చీఫ్
- తమకే కేటాయించాలంటున్న సీపీఐ

**నేటి ఫోకస్ న్యూస్, ఖమ్మం-ఫిబ్రవరి28:**

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆశావహులకు ఖమ్మం సీటు హాట్ కేక్‌లా మారింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించడంతో కాంగ్రెస్ పార్టీకి ఇది గ్యారెంటీగా మారింది. దీంతో అందరి కన్నూ ఖమ్మంపై పడింది. కాటికి కాళ్లు చాపుకున్న వారు కూడా మేము సైతం అంటున్నారు. ఇక్కడ ప్రధాన పోటీదారుగా ఉన్న మాజీమంత్రి రేణుకాచౌదరి రాజ్యసభకు వెళ్లడంతో మరికొందరికి ఇప్పుడు ఈ సీటుపై కన్నుపడింది. అయితే అదిష్టానం ఎవరికి గ్రీన్ సిగ్నల్ ఇస్తుందన్నది పక్కన పెడితే ఎవరికి వారు తామే అర్హులమని కాంగ్రెస్‌లో ప్రచారం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో తాజాగా సీనియర్ నేత విహెచ్ కూడా ముందు వరసలోకి వచ్చారు. నాకు అన్యాయం జరిగింది కనుక ఖమ్మం సీటు ఇవ్వాలన్నది ఆన అభిమతంగా ఉంది. ఇప్పటికే రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా వ్యవహరి స్తున్న ముగ్గురు మంత్రుల కుటుంబసభ్యులు టికెట్ రేసులో ఉండగా, ఇప్పుడు మరికొన్ని కొత్త ముఖాలు తెరపైకి వస్తున్నాయి. తమకంటే తమకే అవకాశం కల్పించాలంటూ పార్టీ సీనియర్లు బహిరంగంగా కోరుతున్నారు. ఇలా ఖమ్మం టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న డజన్ మంది లీడర్లు ఎవరి ప్రయత్నాల్లో వారుంటే, పొత్తుల్లో భాగంగా ఈ సీటును తమకు కేటాయించాలని సీపీఐ







పట్టుబడుతుండడం ఆసక్తి రేపుతోంది. మొత్తంగా ఖమ్మం పార్లమెంట్ కోసం కాంగ్రెస్‌లో పోటీ ఎక్కువయ్యింది. తొలుత ఇక్కడి నుంచి సోనియాను బరిలోకి దింపాలని రాష్ట్ర కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ మేరకు తీర్మానం కూడా చేసింది. అయితే అనూహ్యంగా సోనియా రాజ్యసబకు వెళ్లి పోయారు. కనుక ఆమె ఇక పోటీచేసే అవకాశం లేదు. ఒకవేళ ప్రియాంక ఓకే చెబితే ఇక పోటీ అన్నది ఉండదు. సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ రాజకీయాల్లో ఉంటూ, సోనియా కుటుంబానికి వీరవిధేయుడిగా చెప్పుకునే వీహెచ్ కూడా ఖమ్మం సీటు కోసం పట్టుపడ్తున్నారు. తనకంటే అర్హతలెవరికి ఉన్నాయో చెప్పాలని ఆయన ప్రశ్నిస్తున్నారు. ఇక కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుమకుమార్ కూడా తాజాగా రేసులోకి వచ్చారు. హైదరాబాద్ సెంట్రిక్ గా పాలిటిక్స్ చేసే ఆయన, ఇటీవల ఖమ్మం డీసీసీ ఆఫీసులో ప్రెస్ మీట్ పెట్టి మరీ ఖమ్మం పార్లమెంట్ టికెట్ తనకివ్వాలని హైకమాండ్‌ను కోరారు. ఇక డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క భార్య నందిని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోదరుడు ప్రసాద్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్‌తో పాటు వ్యాపారవేత్త వీవీసీ రాజేంద్రప్రసాద్ కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నారు. మాజీ కేంద్రమంత్రి రేణుకాచౌదరికి కాంగ్రెస్ ఇటీవల రాజ్యసభ సీటు కేటాయించడంతో ఆమె పోటీ నుంచి తప్పుకున్నారు. లేదంటే ఆమో కూడా రేసులో ఉండేవారే! మరోవైపు కామ్రేడ్లు కూడా ఖమ్మం సీటుపై కన్నేశారు. అసెంబ్లీ ఎన్నికల టైంలో కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకొని, ఒక్క అసెంబ్లీ సీటుతో సరిపెట్టుకున్న సీపీఐ, ఇప్పుడు తమకొక పార్లమెంట్ సీటు కేటాయించాలనే డిమాండ్ పెట్టింది. రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్‌తో చర్చలు జరిపినప్పటికీ పొత్తులు, సీట్ల సర్దుబాటుపై నిర్ణయం హైకమాండ్‌దేనని ఇక్కడి లీడర్లు స్పష్టం చేయడంతో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో సీపీఐ జాతీయ నేతలు చర్చించినట్టు సమాచారం. రాష్ట్రంలో తమకు పట్టున్న ఐదు ఆప్షన్లను కామ్రేడ్లు ముందుకు తెస్తున్నారు. ఖమ్మం, వరంగల్, నల్గొండ, భువనగిరి, పెద్దపల్లి స్థానాల్లో ఏదో ఒకటి కేటాయించాలని కోరుతున్నారు. ఇటీవల కొత్తగూడెం అసెంబ్లీ సీటును గెల్చుకోవడంతో పాటు సంస్థాగతం గా బలంగా ఉన్న ఖమ్మం పార్లమెంట్? స్థానం వైపే సీపీఐ మొగ్గుచూపుతోంది. 2014 ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌తో సీపీఐ పొత్తు పెట్టుకోగా, ఖమ్మం సీటును సీపీఐకి ఇచ్చారు. ఆ పార్టీకి అప్పుడు రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న కె.నారాయణ ఖమ్మం లోక్‌సభ సెగ్మెంట్ నుంచి పోటీ చేసి మూడో స్థానంలో నిలిచారు. మళ్లీ ఇప్పుడు తమకే కేటాయించాలని సీపీఐ కోరుతోంది. 2014 ఎన్నికల్లో వైసీపీకి సీపీఎం మద్దతివ్వగా, అప్పుడు వైసీపీ తరపున పోటీ చేసిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గెలిచారు. ఇప్పుడు ఆయన కాంగ్రెస్‌లో ఉండగా, సొంత తమ్ముడు ప్రసాద్ రెడ్డికి టికెట్ ఇప్పించుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. మొత్తంగా ఇప్పుడు ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు. హైకామండ్ ఎవరిని ఆదరిస్తుందో చూడాలి.

# ఇండియా కూటమి బలపడుతుంది

- బిజెపికి ఇక నూకలు చెల్లినట్లే
- ప్రజల నమ్మకాన్ని కోల్పోయిన మోడీ
- కాంగ్రెస్ నేత మల్లు రవి

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఫిబ్రవరి28:**

కేంద్రంలో మోడీకి వ్యతిరేకంగా మిషన్ మొదలయ్యిందని...ఇక బిజెపి ఆటలు సాగవని కాంగ్రెస్ సీనియన్ నేత మల్లు రవి అన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న మోడీకి ప్రజలు గుణపాఠం చెప్పడం ఎంతో దూరం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి ప్రజలకు అండగా ఉంటుందని అన్నారు. బిజెపి దేశానికే కాదు... రాష్ట్రాలకు కూడా ఏమీ చేయలేదని ప్రజలు కూడా గుర్తించారని అన్నారు. అలాంటి బిజెపిని ఎంత త్వరగా సాగనంపితే అంతమంచిదని అన్నారు. దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడం గతంలో ఎప్పుడూ ఇంతగా జరగలేదన్నారు. తమ స్వార్థం కోసం బిజెపి ఎంతటి చర్యలకైనా దిగుతోందన్నారు. విపక్షాలు లక్ష్యంగా చేస్తున్న ఈ చర్యలను ప్రజలు గమనించారని అన్నారు. ప్రజలు అంత అమాయకులు కాదుకదా అని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దళారీలను బాగు చేయడం మినహా ప్రజలకు చేసింది శూన్యమని విమర్శించారు. ప్రజల కోసం చేసిన ఒక్క మంచి పథకం ఏదో చెప్పాలని బీజేపీకి సవాల్ విసిరారు. ఆదానీ, అంబానీలకు దోచిపెడుతున్న తీరు వల్ల దేశ అర్థిక వ్యవస్థ దిగజారిందన్నారు. ఢిల్లీలోని బీజేపీ సర్కారును గద్దె దింపే కార్యక్రమం మొదలైందని మల్లురవి వ్యాఖ్యానించారు. ఇండియా కూటమికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక బీజేపీ కుట్రలు పన్నుతున్నదని మండిపడ్డారు. అన్ని పార్టీలు కలసి ముందుకు వస్తున్నాయని, విభేదాల సృష్టించి పబ్బం గడుపుకోవాలని బిజెపి ప్రయత్నాలు చేస్తోందని



అన్నారు. బిజెపి పునాదులు కదులుతున్నాయని అన్నారు.అభివృద్ధికి సహకారం అందించవలసిందిగా కేంద్రంలోని బీజేపీని రాష్ట్రాలు అభ్యర్థిస్తున్నా పట్టింపు లేదు. జివిస్టీ భారాలను పట్టించుకోవడం లేదు. అలాగే బిజెపికి రాష్ట్రాలను అభివృద్ది చేయాలన్న కాంక్ష లేదన్నారు. ఈ నేపథ్యంలో తాము మొదలెట్టిన ప్రత్యామ్నాయ ప్రయత్నం విజయవంతం అవుతుందన్నారు. రాహుల్ నాయకత్వంలో ప్రత్యామ్నాయ వేదిక అయిన ఇండియా కూటమిని ఏర్పాటు చేసి మోడీని గద్దె దించేందుకు సమరశంఖం పూరించామని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా గొంతు కలుపుతున్న అన్ని రాష్ట్రాలు కూడా ఇప్పుడు ఏకం అయ్యాయని అన్నారు. నరేంద్ర మోదీ వ్యతిరేక ఉద్యమానికి నాయకత్వం వహించడానికి అందరూ అర్హులేనని ఇతరులకు అభ్యంతరాలు లేవని అన్నారు. బీజేపీనే మళ్లీ అధికారం లోకి వస్తే పరిస్థితి ఏమిటన్నదే ఇప్పుడు అందరిలోనూ చర్చగా మారిందన్నారు. బిజెపికి అంత సీన్ లేదని రానున్న రోజుల్లో మరింత స్పష్టత రాగలదని కాంగ్రెస్ నేత అన్నారు. అందుకే ఇప్పుడు ప్రతి ఒక్కరూ కూటమి వైపు చూస్తున్నారని అన్నారు. అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలకు అందాలన్నది తమ ఆకాంక్ష అని తెలిపారు.


# కరీంనగర్‌కు ఏం చేశావో చెప్పు బండి

## మరోమారు నిలదీసిన మంత్రి పొన్నం

**నేటి ఫోకస్ న్యూస్, వేములవాడ-ఫిబ్రవరి28:**

రాముడి జన్మ ఎక్కడాఅని అడిగే మూర్ఖుడు ఉన్నాడా? రాముని పేరు చెప్పి ఓట్లు ఆడుకుంటున్నారు. మార్కెటింగ్ చేసుకుంటున్నారు. రాముడి గురించి తప్పుగా మాట్లాడితే సజీవ దహనానికి సిద్ధమని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం వేములవాడ మండలం నాంపల్లి శ్రీలక్ష్మీ నరసింహ స్వామిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బండి సంజయ్ అమ్మకు పుట్టినవా అని అన లేదు అంటున్నాడు. అమ్మను రాజకీయాల్లోకి తీసుకువచ్చింది ఎవరని ప్రశ్నించారు. హుస్నాబాద్ అంబేద్కర్ విగ్రహం వద్ద బతికున్న మా అమ్మను పట్టుకొని తప్పుగా మాట్లాడావు. మా అమ్మ ఆత్మ ఘోషిస్తుంది వెధవ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్లలో కరీంనగర్ ఎంపీగా చేసిన అభివృద్ధిపై చర్చకు రమ్మంటే రావడం లేదన్నారు. హిందువుని చెప్పు కుంటున్న బండి సంజయ్ వేములవాడ దేవస్థానానికి ఏం చేశాడో చెప్పాలని డిమాండ్ చేశారు. దండం పెట్టి అడుగుతున్న.. అందరిని కోరుతున్న ఈ మూర్ఖుడు ఐదేళ్లలో కరీంనగర్ పార్లమెంట్ నియోజ వర్గానికి ఏం చేశాడో నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.





# విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించేలా చర్యలు

**నేటి ఫోకస్ న్యూస్, నల్లగొండ-ఫిబ్రవరి28:**

జిల్లాలో పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని విద్యాశాఖ అధికారులను డిఇవో ఆదేశించారు. అలాగే పరీక్షల్లో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా మానసికంగా వారిని సిద్ధం చేయాలన్నారు. పరీక్షలంటే ఉండే భయాన్ని తొలగించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు.

# మా పొత్తు అధికారం కోసం కాదు.. రాష్ట్రాన్ని కాపాడేందుకు..

- రాష్ట్రాన్ని విధ్వంసం చేసిన వైసీపీని ప్రజలు తరిమికొట్టాలి
- వచ్చే ఎన్నికలు రాష్ట్రానికి ఎంతో కీలకం
- వైసీపా దొంగలపై టీడీపీ-జనసేన శ్రేణులు పోరాడాలి
- 'తెలుగు జన విజయకేతనం' ఉమ్మడి సభలో చంద్రబాబు
- అన్ని వర్గాలను జగన్ మోసం చేశారు
- సిద్ధం అంటున్న జగన్ కు యుద్ధం ఇద్దాం
- ఐదుగురు రెడ్ల కోసం తిప్పలు పడుతున్న 5 కోట్ల ప్రజలు
- జనసేనాధినేత పవన్ కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు

**నేటి ఫోకస్ న్యూస్, అమరావతి-ఫిబ్రవరి28:**

వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ కోసమే టీడీపీ-జనసేన పార్టీలు కలిశాయని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు తెలిపారు. రాష్ట్రాన్ని విధ్వంసం చేసిన ఆ పార్టీని ప్రజలు తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికలు రాష్ట్రానికి ఎంతో కీలకమని, వైసీపా దొంగలపై టీడీపీ-జనసేన శ్రేణులు పోరాడాలని సూచించారు. తాడేపల్లిగూడెంలో నిర్వహించిన 'తెలుగు జన విజయకేతనం' ఉమ్మడి సభలో ఆయన మాట్లాడారు. తాడేపల్లిగూడెం సభ చరిత్ర తిరగరాసే సభ అని చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రాన్ని కాపాడుకోవడం కోసం జరుగుతున్న మొదటి ఎన్నికల ప్రచార సభ ఇదేనన్నారు. అహంకారంతో రాష్ట్రాన్ని చేసిన వారిని తరిమి కొట్టడానికి ప్రజలు సిద్దంగా ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికలు రాష్ట్రానికి కీలకమని అందుకే రెండు పార్టీలు కలిసి బరిలో దిగబోతున్నాయన్నారు. రెండు పార్టీలు కలిసింది రాష్ట్ర ఐదు కోట్ల మంది ప్రజల భవిష్యత్తు కోసమన్నారు. విధ్వంసమైన రాష్ట్రాన్ని నిలబెట్టడానికే తాను, పవన్ చేతులు కలిపామని చంద్రబాబు అన్నారు. ఈ రోజు టీడీపీ, జనసేనల పొత్తు తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడం కోసమేనని అన్నారు. రాష్ట్రంలో ఒక వ్యక్తి అహంకారన్ని చూస్తూ ఉండలేమన్నారు. అందుకే ఈ పొత్తు ప్రజలు కోరుకున్న పొత్తు అన్నారు.2029కి విజన్ డ్యాక్యుమెంటు తయారు చేశామని చంద్రబాబు అన్నారు. హైదరాబాద్ కంటే మిన్నగా రాజధాని ఉండాలని అమరావతికి రూపకల్పన చేశామన్నారు. పోలవరం ద్వారా ప్రతి ఎకరాలకు నీళ్లుచ్చే సంకల్పంతో ముందుకెళ్లామన్నారు. కానీ రాష్ట్రంలో ఇప్పుడు సైకో పాలన ఉందన్నారు. ఏ సీఎం అయినా అభివృద్ధి పనులతో పాలన సాగిస్తారు కానీ.. జగన్ సీఎం అయ్యాక అరాచకాలతో పాలన సాగిస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యాన్ని జగన్ అపహాస్యం చేశారని చంద్రబాబు అన్నారు. వైసీపీ వేధింపులు తట్టుకోలేక క్రికేటర్ హనుమ విహారీ పారిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. సొంత చెల్లి మరో పార్టీలో చేరితో సోషల్ మీడియాలో వేధించారన్నారు. జగన్ మానసిక స్థితికి ఈ ఘటనలే నిదర్శనమని, అందుకే వైసీపీని చిత్తుగా ఓడించి సైకో నుంచి రాష్ట్రాన్ని విముక్తి కల్పించాలన్నారు. జగన్ గతంలో 25 ఎంపీలను ఇస్తే ప్రత్యేక హెూదా తెస్తామన్నారు? తెచ్చారా..? అని చంద్రబాబు ప్రశ్నించారు. కుప్పం ప్రాంతానికి నీళ్ల పేరిట జగన్ నాటకాలు వేశారన్నారు. ఒక్క రోజుల్లోనే అంతా సర్దుకొని పోయారన్నారు. వచ్చే ఎన్నికల్లో కుప్పం నియోజకవర్గంలో లక్ష ఓట్ల మెజార్టీ వస్తుందన్నారు. జగన్ పాలన ఒక అట్టర్ ఫ్లాప్ సినిమా.. అలాంటి సినిమాకి సీక్వేల్ ఉంటుందా అని ప్రశ్నించారు. టీడీపీ , జనసేన కూటమి సూపర్ హిట్.. వైసీపీ గుండాలకు తమ సినిమా చూపిస్తామన్నారు. వైనాట్ 175కాదు.. వై నాట్ పులివెందుల అని చంద్రబాబు అన్నారు. అన్ని వర్గాలను జగన్ మోసం చేశారని పవన్ కళ్యాణ్ అన్నారు. సిద్ధం అంటున్న జగన్‌కు యుద్ధం ఇద్దామని అన్నారు. రాష్ట్రంలో ఐదుగురు రెడ్ల కోసం 5 కోట్ల ప్రజలు తిప్పలు పడుతున్నారు. టీడీపీ-జనసేన కలిస్తేనే ప్రజల భవిష్యత్తు బాగుంటుందని పొత్తు పెట్టుకున్నామని పవన్ అన్నారు. "పర్వతం ఎవరికీ వంగి సలా చేయదు. గొంతు ఎత్తితే ఒక దేశపు జెండాకు ఉన్నంత పొగరు ఉంటుంది.. మన విజయానికి స్ఫూర్తి జెండా.. అందుకే జెండా పేరుతో సభను ఏర్పాటు చేశాం" అని అన్నారు. ఏపీలో రోడ్లపై వెళ్లాలంటే రోజులు గడిచిపోయే పరిస్థితి వచ్చిందని పవన్ కళ్యాణ్ అన్నారు. ఐదుగురు రెడ్ల కోసం 5 కోట్ల ప్రజలు తిప్పలు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో ఏ జిల్లాలో అయినా ఈ ఐదుగురే పంచాయతీ చేస్తున్నారన్నారు. మిగతా ఏ నాయకులకు ఎలాంటి హక్కులులేవన్నారు. వైసీపీ గుండాలు టీడీపీ, జనసేన నాయకులను ఇబ్బంది పెడితే మక్కెలు విరగొట్టి మంచాన పడుకోపెడతామని హెచ్చరించారు.

# మేడిగడ్డకు కెసిఆర్ కూడా వెళ్లాలి

- కుంగిన తీరుపై ప్రజలకు క్షమాపణలు చెప్పాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచన

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఫిబ్రవరి28:**

భారాస నేతల మేడిగడ్డ బ్యారేజీ పర్యటనను స్వాగతిస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఇంత భారీగా అవినీతి చేసి కూడా మేడిగడ్డకు వెళ్తామంటున్నారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్ జలసౌధలో ఆయన మాట్లాడారు. 'భారాస నేతల మేడిగడ్డ పర్యటనకు సహకరించాలని అధికారులను ఆదేశించాం. వారి తీరు 'ఉల్టా చోర్..' సామెతను గుర్తు చేస్తోంది. భారాస మేడిగడ్డ పర్యటనకు కేసీఆర్ సైతం వెళ్లాలి. కుంగిన ఆనకట్ట సాక్షిగా రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలి. మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు కట్టవద్దని నిపుణుల కమిటీ సూచించింది. కాళేశ్వరం రూపంలో రాష్ట్రంపై మోయలేని భారం మోపారు. స్వతంత్ర భారతంలో ఇంత భారీ అవినీతి గతంలో ఎన్నడూ జరగలేదు. ప్రాజెక్టుల విషయంలో భారాస సర్కారు అవినీతిని కాగ్ ఎండగట్టింది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కూడా వివరించింది' అని చెప్పారు. కమిషన్ల కోసమే గత ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణం చేసిందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఇంకా ప్రాజెక్టులు పూర్తి కావడానికి లక్షాల 47 వేల కోట్లు కావాలన్నారు ఉత్తమ్. కాళేశ్వరంలో 25వేల కోట్లు పనులు ఎలాంటి డీపీఆర్ లు లేకుండా అలాట్ చేశారని అన్నారు. గత ప్రభుత్వంలో 94 వేల కోట్ల రూపాయలు కాళేశ్వరం కోసం ఖర్చు చేసి ఐదేళ్లలో 160 టీఎంసీల నీళ్లను మాత్రమే లిఫ్ట్ చేశారని చెప్పారు. ఇందులో ఇరిగేషన్ కోసం వినియోగించింది కేవలం 65 టీఎంసీలే అన్నారు.

ఫోకస్ న్యూస్





# పుష్ప-2 కోసం భారీ ఖర్చు..

ప్రస్తుతం ఇండియాలో మోస్ట్ అవైటెడ్ మూవీ ఏదైనా ఉందా? అంటే అది పుష్ప-2 అనే చెప్పాలి. లెక్కల మాస్టార్ సుకుమార్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కాంబినేషన్‌లో 2022 డిసెంబర్‌లో వచ్చిన పుష్ప సినిమా పాన్ ఇండియా రేంజ్‌లో బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. తగ్గేదేలే.. అంటూ బన్నీ చెప్పిన డైలాగ్ దేశవ్యాప్తంగా సినీ అభిమానులకు తెగ నచ్చేసింది. ఈ సినిమా సెకండ్ పార్ట్ ఎప్పుడెప్పుడు వస్తుందా అని సినీ అభిమానులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించి ఒక సాలిడ్ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఈ మూవీలో ఇంటర్వెల్ సీన్ గంగమ్మ జాతర బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. అయితే ఈ ఇంటర్వెల్ సీన్ కోసమే మేకర్స్ రూ.50 కోట్లు ఖర్చుపెట్టినట్లు టాక్ వినిపిస్తోంది. గంగమ్మ జాతర సీక్వెన్స్ దాదాపు 25 నిమిషాలు ఉండనున్నట్లు తెలుస్తోంది. దీంతో మూవీ ఎంత గ్రాండ్‌గా ఉంటుందోనని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. చిత్తూరు, తిరుపతిలోని ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంలో ఈ సినిమా కథ సాగనుండగా.. తిరుపతిలోని స్థానిక గంగమ్మ జాతరలోని సంప్రదాయాన్ని సుక్కు ఈ సినిమాలో చూపించనున్నాడు.





# అనుపమ బంపరాఫర్

మలయాళ ముద్దుగుమ్మ అనుపమ పరమేశ్వరన్ బంపరాఫర్ ఇచ్చింది. తనకు ఒక ఖడ్గమృగాన్ని తెచ్చి బహుమతిగా ఇస్తే మీ సొంతం అయిపోతానని చెప్పేసింది. ఇప్పుడు ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఎందుకంటే అనుపమ లాంటి అమ్మాయి ఆఫర్ ఇస్తే ఎవరు కాదంటారు చెప్పండి. కచ్చితంగా ఆ గిఫ్ట్ కొనిచ్చేస్తారుగా. ఇంతకీ అనుపమ ఏం చెప్పింది? అసలేం జరిగింది? మలయాళ 'ప్రేమమ్'తో హీరోయిన్‌గా కెరీర్ ప్రారంభించిన అనుపమ.. 'అఆ' మూవీతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత 'శతమానం భవతి', 'హలో గురు ప్రేమ కోసమే', 'కార్తికేయ 2' తదితర చిత్రాలు చేసింది. రీసెంట్‌గా రవితేజ 'ఈగల్'లో కీలక పాత్రలో కనిపించింది. ఈమె సూపర్ హాట్‌గా నటించిన 'టిల్లూ స్క్వేర్' త్వరలో థియేటర్లలోకి రానుంది. సినిమాల సంగతి పక్కనబెడితే సోషల్ మీడియాలోనూ చురుగ్గా ఉంటే అనుపమ.. అభిమానులతో టచ్‌లో ఉంటుంది. తాజాగా ఓ ఖడ్గమృగం పిల్లకి సంబంధించిన ఓ వీడియోని పోస్ట్ చేసి, దీన్ని ఎవరైనా తనకు బహుమతిగా ఇస్తే తను వాళ్ల సొంతమైపోతానని చెప్పింది. అంటే డేటింగ్ లేదా పెళ్లి చేసుకుంటానని ఫన్నీగా చెప్పింది.

# పోచర్ వెబ్‌సీరిస్ చూసి మహేశ్ ఎమోషనల్



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియా భట్ నిర్మాతగా మారి తెరకెక్కించిన తాజా వెబ్ సిరీస్ 'పోచర్'. ఈ సిరీస్‌ను ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోతో కలిసి అలియా భట్ నిర్మించింది. ప్రస్తుతం ఈ వెబ్ సిరీస్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వెబ్ సిరీస్ చూసిన సూపర్ స్టార్ మహేష్ బాబు 'పోచర్'పై ప్రశంసల వర్షం కురిపించాడు. ఎవరైనా ఏనుగులను అలా ఎలా చంపగలరు. వారికి మానవత్వం లేదా? అలా చేస్తున్నప్పుడు వారి చేతులు వణకడం లేదా? ఈ క్రైమ్-థ్రిల్లర్ చూస్తున్నప్పుడు నా మైండ్ లో ఇవే ప్రశ్నలు తిరుగుతూ ఉన్నాయి. ఈ జెంటిల్ జెయింట్స్ ని కాపాడుకునేందుకు సమాజంలో ప్రతి ఒక్కరు పోరాడాలి అంటూ మహేష్ రాసుకొచ్చాడు. కాగా ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మలయాళ నటులు నిమిషా సజయన్, రోషన్ మథ్యూ, దివ్యేంద్ర భట్టాచార్య తదితరులు ప్రధాన పాత్రల్లో నటించిన ఈ వెబ్ సిరీస్‌కు ఎమ్మీ అవార్డు విన్నర్ రిచీ మెహతా దర్శకత్వం వహించాడు. అమెజాన్ ప్రైమ్ లో హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రస్తుతం అందుబాటులో ఉంది. ఈ సిరీస్ కథ విషయానికి వస్తే.. ఏనుగు దంతాల స్మగ్లింగ్‌తో పాటు, అడవుల్లో వన్య ప్రాణులపై దాడుల చేసే వారిపై ఈ సిరీస్ వచ్చింది. ఇక వారిని పట్టుకునేందుకు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారులు, ఔఉక్ష కార్మికులు, లోకల్ పోలీసులు ఎం చేశారు అనేది ఈ సిరీస్ కథ.

# మార్చి 1న వస్తోన్న చారి111

'వెన్నెల' కిశోర్ హీరోగా నటించిన చిత్రం 'చారి 111'. సంయుక్తా విశ్వనాథన్ కథానాయికగా, మురళీ శర్మ ప్రధాన పాత్రల్లో నటించారు. టీజీ కీర్తికుమార్ దర్శకత్వంలో అదితీ సోనీ నిర్మించిన ఈ చిత్రం మార్చి 1న విడుదలవుతోంది. అదితీ సోనీ మాట్లాడుతూ.. నిర్మాతగా 'చారి 111' నా తొలి సినిమా. వైవిధ్యమైన కథతో తీసిన మంచి వినోదాత్మక చిత్రమిది. వెన్నెల కిశోర్ కామెడీని ప్రతి ఒక్కరు ఎంజాయ్ చేస్తారు' అన్నారు. మళ్ళీ మొదలైంది' సినిమా తర్వాత నేను చేసిన ద్వితీయ చిత్రం 'చారి 111'. ఇదొక స్పై యాక్షన్ కామెడీ జానర్ ఫిల్మ్ అన్నారు టీజీ కీర్తికుమార్. ఈ సినిమాలో ఒక్కటే పాట ఉంది. ఈ పాటని అద్భుతంగా రాయడానికి మూడు నెలల సమయం తీసుకున్నానన్నారు రామజోగయ్య శాస్త్రి. తెలుగులో నాకు తొలి చాన్స్ ఇచ్చిన యూనిట్‌కి థ్యాంక్స్ అన్నారు సంయుక్తా విశ్వనాథన్. ఈ సినిమాకు మ్యూజిక్ అందించడం హ్యాపీగా ఉందన్నారు.



